పోలీసుల అత్యుత్సాహం

భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులు: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి

చేర్యాల, జనవరి 7: కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులతో కొందరు పోలీసులు దురుసుగా వ్యవహరిస్తూ అత్యుత్సాహం ప్రదర్శించారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ స్వామివారి కల్యాణోత్సవంలో తమను ఎవరూ పట్టించుకోకున్నా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయం పాటించారన్నారు. పాస్‌లు ఉన్నా.. లేకున్నా స్వామివారి కల్యాణోత్సవం విజయవంతం చేసేందుకు తమ పార్టీ శ్రేణులు సహకరించారని తెలిపారు. ఆలయ వద్ద సరైన ఏర్పాట్లు కల్పించకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు.

'మల్లన్న' మా కుల దైవం: ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

కొమురవెల్లి మల్లన్న మా కుల దైవమని, తాను చిన్ననాటి నుంచి కొమురవెల్లికి వస్తున్నానని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. నేను హ్యాట్రిక్ మల్లారెడ్డినని, తనతో పాటు తమ కుటుంబంలో మూడు తరాలుగా కొమురవెల్లి మల్లన్న పేరు పెట్టుకున్నామన్నారు. పాలు అమ్మినా.. పూలు అమ్మినా.. ఏ వ్యాపారం చేసిన మల్లన్న దీవెనలతోనే సక్సెస్ అయ్యానని చెప్పారు.

నేడు మల్లన్న ఆలయంలో లక్ష బిల్వార్చన

చేర్యాల, జనవరి 7: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఆలయ వర్గాలు లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించనున్నారు. కల్యాణం మరుసటి రోజు లక్ష బిల్వార్చన పూజలను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ. అనువంశిక వీరశైవ ఆగమశాస్త్ర ప్రకారం స్వామివారి ఆలయంలో స్వస్తిక్ పుణ్యవచనం, గణపతి పూజ, పంచచార్య పూజలు, రుద్రాభిషేకం, బిల్వార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, మహా నైవేద్యం తదితర పూజలు నిర్వహించనున్నారు. అంతేకాకుండా లక్ష బిల్వాలను(మారేడు) స్వామి మూలవిరాట్ వద్ద సమర్పిస్తూ 1008 పర్యాయాలు మల్లన్న నామస్మరణలను పఠిస్తూ బిల్వార్చన పూజలు చేస్తారు.

సత్యాత్మతీర్థ శ్రీపాదులవారికి స్వాగతం పలుకుతున్న భక్తులు

ఘనంగా మఠం సంస్థాపన పూజలు

వర్గల్, జనవరి 7: అనంతగిరిపల్లి శివారులోని శ్రీరాఘవేంద్రస్వామి బృందావనంలో ఆదివారం మఠం సంస్థాపన పూజా మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తెలంగాణ మధ్వమండలి అధ్యక్షుడు ఉపేందర్‌రావు, ఆలయ ప్రధాన పూజారులు మెలుగు ప్రవీణ్‌కుమార్, గోవర్ధన్‌రావు సమక్షంలో జగద్గురువు శ్రీఉత్తరాధి మఠాధిపతి 1008 సత్యాత్మతీర్థశ్రీపాదుల వారిచేత బృందావనంలో నిర్మించిన కొత్త భవనాలు, శ్రీమఠం మూలరామ పూజ నిర్వహణ కార్యక్రమాలు నిర్విగ్నంగా జరిగాయి. అంతకు ముందు ఉత్తరాధిపతికి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్‌లో ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీ

హుస్నాబాద్ టౌన్, జనవరి 7: హుస్నాబాద్ పట్టణంలో ప్రజాపాలన దరఖాస్తుల డేటాఎంట్రీ వేగవంతంగా జరుగుతున్నది. హుస్నాబాద్‌లోని ఇరువై వార్డుల నుంచి 6,919 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల్లోని వివరాలను మున్సిపల్ కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తుల ఎంట్రీని అధికారులు నిర్వహిస్తున్నారు. ఆదివారం వరకు 2500 వరకు దరఖాస్తుల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

జగదేవ్‌పూర్‌లో 'వికసిత భారత్'

జగదేవ్‌పూర్, జనవరి 7: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న వికసిత భారత్ సంకల్ప యాత్ర ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నట్లు పల్లె దవాఖాన డాక్టర్ సంజనరెడ్డి సీహెచ్‌వో శ్రీమతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పంచాయతీ వద్ద వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పలువురు గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం టీబీ నుంచి కోలుకున్న వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది జితేందర్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు స్వరూప, నిర్మల, కవిత, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కొమురవెల్లిలో తన సొంత వాహనంలో వెళ్తున్న మంత్రి కొండా సురేఖ

మంత్రి కొండా సురేఖ ఆగ్రహం

- కనిపించకుండా పోయిన కాన్వాయ్
- అరగంటపాటు వేచి చూసి సొంత వాహనంలో వెళ్లిపోయిన మంత్రి

చేర్యాల, జనవరి 7 : దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవానికి మంత్రి కొండా సురేఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరయ్యారు. స్వామివారి కల్యాణోత్సవం ముగిసిన వెంటనే మంత్రి పొన్నం వెళ్లిపోయారు. అనంతరం స్వామివారి ఆలయంలో మంత్రి సురేఖ ప్రత్యేక పూజలు చేసి గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణం కోసం అరగంట పాటు కాన్వాయ్ కోసం మంత్రి కొండా సురేఖ గెస్ట్‌హౌస్ వద్ద వేచి ఉన్నారు. అప్పటికీ కాన్వాయి రాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ సొంత వాహనంలో వెళ్లిపోయారు. కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో మంత్రి సురేఖకు కాన్వాయ్ రాకపోవడంతో పలువురు విస్మయం వ్యక్తం చేశారు. కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో ఈసారి పోలీసుల భద్రత వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పించిందని అధికార పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.


ఎమ్మెల్యే ఐలయ్యను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

ఎమ్మెల్యే ఐలయ్యకు సన్మానం

సిద్దిపేట టౌన్, జనవరి 7 : తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం భవన్‌లో ఆలేరు బిడ్డ, కురుమ కులస్తుడు, తొలి శాసనసభ్యుడు బీర్ల ఐలయ్యను ఆదివారం ఆ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుమల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోరే ఎల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంతుల రమేశ్, జిల్లా యువత విభాగం అధ్యక్షుడు ప్రభాకర్, కొండపాక మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల రమేశ్, నాయకులు ఒగ్గు రాంబాబు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గజ్వేల్ అర్బన్, జనవరి 7: గజ్వేల్ పట్టణంలోని విశ్వతేజ జూనియర్ కళాశాలలో 2003-05లో ఇంటర్ చదివిన విద్యార్థులు 20ఏండ్ల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం ప్రజ్ఞాపూర్‌లోని ఓ ఫాంహౌస్‌లో విద్యార్థులు కలుసుకొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని క్రమశిక్షణతో ఎదిగి ఉన్నత స్థానాలను చేరుకున్నందుకు ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. వివిధ రంగాల్లో ఉద్యోగాలు, వ్యాపారంలో స్థిరపడ్డ విద్యార్థులు ఉ న్నారు.

గర్భిణి మృతి

భవాని(ఫైల్)

గజ్వేల్ అర్బన్, జనవరి 7: లోబీపీ, ఆక్సిజన్ అందక నిండుగర్భిణి మృతి చెందిన ఘటనతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్ గ్రామస్తులు విచారంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్‌కు చెందిన రంగ భవాని(25) నాలుగోసారి గర్భంతో గజ్వేల్ ప్రభుత్వ దవాఖానలో కొద్దినెలలుగా వైద్యపరీక్షలు చేయించుకుంటున్నది. ఆదివారం ఉదయం ఇబ్బందిగా అనిపించడంతో గజ్వేల్ ప్రభుత్వ దవాఖానలో వైద్యులను సంప్రదించారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ మంజుల రంగ భవానిని పరీక్షించారు. లోబీపీ, ఆక్సిజన్ లెవల్స్ తక్కువగా ఉండడంతో వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేసినా భవాని శరీరం సహకరించకపోవడంతో మృతిచెందింది. భవాని మృతదేహాన్ని కుటుంబీకులు పల్లెపహాడ్‌కు తరలించారు. భవానికి భర్త, కూతురు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల వనభోజనాలు

హుస్నాబాద్, జనవరి 7: హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఉద్యోగులు ఆదివారం డిపో ఆవరణలో వనభోజనాలు నిర్వహించారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులకు ఆటవిడుపుగా ఉండేలా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆటపాటలతో సరదాగా గడిపారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం నవంబర్‌లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ నర్సయ్య, సామ్యుల్, లక్ష్మి రెడ్డి, ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

వనభోజనాల కార్యక్రమంలో హుస్నాబాద్ డిపో ఉద్యోగులు

రామచంద్రమూర్తి సేవలు మరువలేనివి

కొండపాక, జనవరి 7: పుట్టిన ఊరు రుణం తీర్చుకోవడానికి గ్రామ అభివృద్ధితోపాటు ఆధ్యాత్మిక సేవలు చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన గొల్లపల్లి రామచంద్రమూర్తి పలువురికి ఆదర్శప్రాయుడని పలువురు వ్యక్తులు కొనియాడారు. ఆదివారం దుద్దెడ శంబు దేవాలయం చైర్మన్‌గా దశాబ్ద కాలం సేవలు అందించిన దివంగత రామచంద్రమూర్తి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మంచాల చిన్న శ్రీనివాస్, బూరుగుల వెంకటరమణ, దేశాయిరెడ్డి, రాజయ్య, కోట శ్రీనివాసశర్మ, అర్చకులు వ్యాస నారాయణ, తమ్మలి శంకరయ్య, బింగి భాస్కర్ పాల్గొన్నారు.

రామచంద్రమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు

మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మిరుదొడ్డి, జనవరి 7: బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మిరుదొడ్డి మండల నాయకులు ఆదివారం సిద్దిపేటలోని రంగనాయకసాగర్ విశ్రాంతి భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశం, ఉపాధ్యక్షుడు అర్షద్ నాయకులు రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాములపర్తి జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఆటల్లో గెలుపోటములు సహజం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మర్కూక్, జనవరి 7: ఆటల్లో గెలుపోటములు సహజమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాములపర్తి గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందించారు. మొదటి బహుమతి బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కూక్ మండలాధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ రూ.11వేల111 ఇవ్వగా, ద్వితీయ బహుమతి మర్కూక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ రూ.5 వేల111 నగదును వంటేరు ప్రతాప్ రెడ్డి అందజేశారు. ఫైన్‌లో పాములపర్తి, గంగాపూర్ జట్లు తలపడగా పాములపర్తి జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపీపీ బాలరెడ్డి, కమ్మరి బాల్‌రాజ్, సర్పంచ్‌లు, ప్రవీణ్‌చారి పాల్గొన్నారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామి

దైవం జ్ఞాన స్వరూపం

కొండపాక, జనవరి 7: దైవం జ్ఞాన స్వరూపమని, ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకుంటే జ్ఞాన సాముపార్జన కలుగుతుందని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి అన్నారు. ఆదివారం కొండపాక ఆనంద నిలయం ఆవరణలోని అష్టాదశ శక్తి పీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ మండల పూజాకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పుష్పగిరి పీఠాధిపతి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచసూక్త హోమాలు, బలిహరణం, పూర్ణాహుతితో పాటు శివపార్వతుల కల్యాణం మంత్రోచ్చరణల మధ్య వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు అయిత నాగరాజు, గట్టు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీబీఎఫ్ ప్రధాన కార్యదర్శి శంకర్

సామాజిక చట్టాన్ని అమలు చేయాలి

మిరుదొడ్డి, జనవరి 7: అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమం, అభివృద్ధి, రక్షణ కల్పించి 2008వ భద్రత చట్టాన్ని అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి(డీబీఎఫ్) శంకర్ డిమాండ్ చేశారు. ముంబైలో జాతీయ ప్రజా ఉద్యమాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న అసంఘటిత రంగ కార్మికుల పోరాట హక్కుల జాతీయ సదస్సుకు ఆదివారం ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రం 47 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నదన్నారు. కార్మికుల హక్కులను అమలు చేయకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

రంజోల్ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఘటన

జహీరాబాద్, జనవరి 7: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని స్వప్న(17) కళాశాల ఉన్న డార్మెంటరీ గదిలో ఫ్యాన్‌కు ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థిని స్వప్న ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసి చదువుకునేందుకు పుస్తకాల కోసం డార్మెటరీ గదికి వెళ్లింది. డార్మెటరీ గదికి వెళ్లిన విద్యార్థిని స్వప్న ఫ్యాన్‌కు చున్నీతో ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన తోటి విద్యార్థినులు విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపారు. ఉపాధ్యాయులు గది వద్దకు వెళ్లి ఫ్యాన్‌కు ఊరివేసుకున్న విద్యార్థిని చున్నీ తీసి వెంటనే అక్కడి నుంచి జహీరాబాద్ సర్కారు దవాఖానకు తరలించారు. అక్కడ విద్యార్థినిని పరిశీలించిన వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని దవాఖాన నుంచి వెంటనే ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోస్టుమార్టం చేయరాదని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

తూంకుంటకు చెందిన విద్యార్థిని స్వప్న

మృతురాలు స్వప్న సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామానికి చెందిన బ్యాగరి రాజు, వనజ దంపతుల కుమార్తె. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె స్వప్న ఐదు నుంచి పదో తరగతి వరకు రంజోల్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో చదువుకుంది.ఇంటర్ అదే కళాశాలలో చదువుకుంది. పేద కుటుంబానికి చెందిన స్వప్న చదువులో చాలా చురుకుగా ఉండేది. ఆత్మహత్య చేసుకోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రంజోల్ గురుకుల పాఠశాల గేటు ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు

సంక్రాంతి ముగ్గుల పోటీలు

హుస్నాబాద్ టౌన్, జనవరి 7: వీనెట్ రఘు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కో-ఆర్డినేటర్ గంగిశెట్టి గాంధీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 13, 14, 15వ తేదీల్లో పట్టణంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ఐదుగురిని విజేతలుగా ఎంపిక చేసి 21న బహుమతులు అందజేస్తామన్నారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు

గజ్వేల్‌అర్బన్, జనవరి 7: గజ్వేల్ పట్టణంలో ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో రామభక్తులు ఇంటింటికీ రామయ్య అక్షింతలతో పాటు హనుమాన్ జెండాలను పంపిణీ చేస్తున్నారు. వార్డుల వారీగా బృందాలుగా ఏర్పడి అక్షింతలను ఇంటింటికీ తిరుగుతూ అందజేశారు.

గజ్వేల్‌లో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్న రామభక్తులు

ముట్రాజ్‌పల్లిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ముట్రాజ్‌పల్లిలో...

గజ్వేల్‌అర్బన్, జనవరి 7: అయోధ్య రాముడి కరుణ అందరిపై ఉండాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 17వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీకిషన్ రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ శ్యామల మల్లేశం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో రామభక్తులతో కలిసి ఇంటింటికి వెళ్లి అయోధ్య రామయ్య అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మనోహర్‌యాదవ్, ఏగొండ పాల్గొన్నారు.

నారాయణరావుపేటలో...

నారాయణరావుపేట, జనవరి 7: మండల కేంద్రంలో అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. శ్రీరాముడి అక్షింతలు ఇంటి ముందుకు తీసుకురాగానే మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి అక్షింతలు స్వీకరించారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమం తర్వాత ప్రతి ఇంటా దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ రూరల్‌లో..

హుస్నాబాద్‌రూరల్, జనవరి 7: మండలంలోని పొట్లపల్లి గ్రామంలో ఆదివారం అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవసాని సుశీల, వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, కానుగుల మోహన్, మార్క అనిల్, సుంకరి కిష్టయ్య, మార్క చంద్రయ్య, కర్ర రవీందర్‌రెడ్డి, రామ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.